జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం, మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 24-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 709 పేజీలు: 4 వెల : రూ.7

# 28 నుంచి పల్స్ పోలియో

✲ ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం ✲ జిల్లాలో 1.80 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యం
✲ పల్స్ పోలియో రోజు ఆదివారం పాఠశాలలు తెరచి ఉంచాలి ✲ జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్

**శ్రీకాకుళం, జూన్ 24 (వార్త):**పల్స్ పోలియో కార్యక్రమం ఈనెల 28 నుంచి జరుగుతుందని, దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ ఆదేశించారు. పల్స్ పోలియో రోజైన ఆదివారం పాఠశాలలు తెరచి ఉంచేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పల్స్ పోలియో పై సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశం, వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆదివారం సెలవు దినం కావున చర్చిలు, దేవాలయాలు, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్స్, తదితర వాటి వద్ద పిల్లలను గుర్తించి 0-5 వయసు గల పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీలు, యూత్ కో ఆర్డినేటర్, స్వచ్ఛంద సేవా సంస్థలు, తదితర వాటిని కలుపుకొని వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టాలన్నారు. అంగన్వాడి కేంద్రాలు వద్ద ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు పోలియో చుక్కలు వేయాలని స్పష్టం చేశారు. మత్స్యకారుల గ్రామాలు, పిల్లలను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయాలన్నారు. ఏ ఏ ప్రాంతాలలో ఎప్పుడెప్పుడు పోలియో చుక్కలు వేస్తారో షెడ్యూల్ ని ప్రకటించాలని డిఎం హెచ్వోను ఆదేశించారు. రవాణా, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నైట్ షెల్టర్ ల్లో ఉండే పిల్లలకు పోలియో చుక్కలు వేసే విధంగా చర్యలు మున్సిపల్ హెల్త్ అధికారిని ఆదేశించారు. 5 ఏళ్ల లోపు పిల్లలున్న తల్లిదండ్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు.డిఎంహెచ్ఓ డాక్టర్ కె. అనిత మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పోలియో వ్యాక్సిన్ తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హై-రిస్క్ ఏరియాలైన వలస కార్మికులు, మురికివాడలు, ఇటుక బట్టీలు, నిర్మాణ స్థలాల వంటి 128 అధిక ముప్పు ఉన్న ప్రాంతాల్లోని 22,734 ఇళ్లకు చెందిన 3,860 మంది పిల్లలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో 0-5 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేసేందుకు వీలుగా ఈ నెల జూన్ 28, 29, 30 తేదీల్లో తీవ్రతర పల్స్ పోలియో నివారణ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. అనిత వెల్లడించారు. మొత్తం 23.62 లక్షల జనాభా ఉన్న శ్రీకాకుళం జిల్లాలో ఈ విడతలో 1,80,879 మంది చిన్నారులను లక్ష్యంగా గుర్తించారు.



### ప్రణాళిక ఇదే..

మొదటి రోజు 28న నిర్దేశిత బూత్‌లలో పోలియో చుక్కలు వేస్తారు. 29, 30 తేదీల్లో బూత్‌లలో టీకా వేయించుకోని పిల్లల కోసం సిబ్బంది 6,11,630 ఇళ్లను సందర్శించి 'ఇంటింటికీ' పోలియో చుక్కలు వేయనున్నట్లు జేసీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 527, గిరిజన ప్రాంతాల్లో 377, పట్టణ ప్రాంతాల్లో 192 బూత్‌లను ఏర్పాటు చేశారన్నారు. వీధులు, పొలాలు, ఆట స్థలాల్లోని పిల్లల కోసం 84 మొబైల్ బృందాలను, అలాగే ప్రయాణికులకు వీలుగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, దేవాలయాలు, సంతలలో 40 రవాణా (ట్రాన్సిట్) బూత్‌లను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం 7,430 మంది సిబ్బందిని, పర్యవేక్షణకు 122 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు వివరించారు. వ్యాక్సిన్ రవాణా, పర్యవేక్షణ కొరకు 206 వాహనాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వ్యాక్సిన్ల సామర్థ్యం చెడకుండా జిల్లా వ్యాప్తంగా 110 డీప్ ఫ్రీజర్లు, 118 ఐఎల్ఆర్‌లు, 120 కోల్డ్ బాక్సులు, 2,100 వ్యాక్సిన్ క్యారియర్లు, 15,680 ఐస్ ప్యాక్‌లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మొత్తం 71 పిహెచ్సీలు, 13 యుపిహెచ్సీల పరిధిలో పంపిణీకి 2,90,000 డోసుల ఓపివి వ్యాక్సిన్ సిద్ధంగా ఉంచినట్లు వివరించారు.

### అవగాహన, శిక్షణ..

ఈ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు పాంప్లెట్లు, పోస్టర్లు, బ్యానర్లతో పాటు గ్రామాల్లో, మండల కేంద్రాల్లో రెండు రోజుల పాటు మైక్ ప్రచారం, డప్పు చాటింపు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు జేసీ తెలిపారు. ఈ విడత పోలియో మహాయజ్ఞంలో 122 మంది సూపర్‌వైజర్లు, 1,186 మంది పారామెడికల్ సిబ్బందితో పాటు 2,047 మంది ఆశా కార్యకర్తలు, 5,443 మంది అంగన్‌వాడీ సిబ్బంది పూర్తి శిక్షణ పొంది సేవలందించనున్నట్లు తెలిపారు. 5 ఏళ్ల లోపు పిల్లలున్న తల్లిదండ్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, డీఎంహెచ్వో డాక్టర్ కె. అనిత, అదనపు డిఎంహెచ్ఓ శ్రీకాంత్, డిఐఓ రామదాసు, అటవీ శాఖ అధికారి రాజశేఖర్, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంలో రైతు మృతి

**మెళియాపుట్టి, జూన్ 24 (వార్త):** విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృత్యువాత పడిన సంఘటన మెళియాపుట్టి మండలంలో బుధవారం వెలుగుచూసింది. దుర్భలాపురం గ్రామానికి చెందిన పెద్దింటి మోహనరావు(63) అనే కౌలు రైతు వ్యవసాయం నిమిత్తం పొలానికి వెళ్ళి విద్యుత్ ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందినట్టు తెలిపారు. మృతుడికి భార్య ఆరుద్రమ్మ కుమారుడు సంజీవరావు ఉన్నారు .ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. దీనిపై స్థానిక మెళియాపుట్టి ఎస్ఐ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాస్ పోర్ట్ పోయినది

నేను అనగా కొల్లి శివకుమార్. తండ్రి పేరు కొల్లి దండాసి. బెల్లుపటియా గ్రామం. తేది.10.06.2026న మందస గ్రామం నుంచి ఆటలో బెల్లుపటియా వెళ్తుండగా నా యొక్క బ్యాగ్ దారిలో ఎక్కడో పడిపోయింది. అందులో నా పాస్ పోర్ట్, ఇండియన్ సిడిసి ఎక్స్ పీరియన్స్ సర్టిఫికెట్స్ ఉన్నవి. పలుచోట్ల వెతికినా లభ్యం కాలేదు. పాస్ పోర్టు నెంబరు. W 8071754. ఇండియన్ సిడిసి నెంబర్ MUM 499415. ఎవరికైన దొరికితే దయచేసి, నాకు చేరవేయగలరని వినయపూర్వకంగా కోరుతున్నాను. నా ఫోన్ నంబరు.7386887344

## పాస్ పోర్ట్ పోయినది

నేను అనగా అగ్గున్న రేణుకుమార్. తండ్రిపేరు దయానిధి. బెల్లుపటియా గ్రామం. తేది.06.06.2026న బెల్లుపటియా గ్రామం నుంచి ఆటోలో మందస వెళ్లుండగా నా యొక్క బ్యాగ్ దారిలో ఎక్కడో పడిపోయింది. అందులో నా పాస్ పోర్ట్, ఎక్స్ పీరియన్స్ సర్టిఫికెట్స్ ఉన్నవి. పలుచోట్ల వెతికినా లభ్యం కాలేదు. పాస్ పోర్టు నెంబరు. ఎల్.2852497. ఎవరికైన దొరికితే దయచేసి, నాకు చేరవేయగలరని వినయపూర్వకంగా కోరుతున్నారు. నా ఫోన్ నంబరు. 8790517743

కూటమి ప్రభుత్వంలోనే..

# సాగునీటి రంగానికి మహర్దశ

✲ వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతాంగం కుదేలు ✲ ఐదేళ్లు నిర్లక్ష్యం.. రెండేళ్లలోనే అభివృద్ధి ✲ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో 'వంశధార'కు రూ.9 .8 కోట్లు మంజూరు ✲ ఎడమ కాలువ ఆధునీకరణకు ఉత్తర్వులు చేసిన ప్రభుత్వం ✲ జిల్లా రైతాంగం తరపున ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మంత్రి

**శ్రీకాకుళం, జూన్ 24 (వార్త):** జిల్లా రైతాంగానికి సాగునీరందించే కీలకమైన బి.ఆర్.ఆర్. వంశధార ప్రాజెక్టు పరిధిలోని కాలువల ఆధునీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ, నిరంతర కృషి ఫలితంగా ఈ నిధులు మంజూరయ్యాయి. వంశధార ఎడమ ప్రధాన కాలువ (కిలోమీటర్ 0.00 నుండి 55.730 వరకు) ఆధునీకరణ పనులతో పాటు 24ఆర్ డిస్ట్రిబ్యూటరీ (నరసన్నపేట బ్రాంచ్ కెనాల్), 25ఆర్ డిస్ట్రిబ్యూటరీ (మేఘవరం బ్రాంచ్ కెనాల్) అభివృద్ధి పనుల కోసం రూ. 900.80 లక్షల (సుమారు రూ. 9.8 కోట్లు) పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం అధికారిక ఉత్తర్వులు (జి ఓ ఆర్టీ.342) జారీ చేశారు. స్థానిక రైతాంగ అవసరాలను గుర్తించి, పనులను వేగవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ప్రభుత్వంపై తెచ్చిన ఒత్తిడి వల్లే ఈ నిధుల మంజూరు సాధ్యమైందని నియోజకవర్గ నేతలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులతో వంశధార ఎడమ ప్రధాన కాలువతో పాటు నరసన్నపేట, మేఘవరం బ్రాంచ్ కాలువలకు మెరుగుదల పనులు చేపట్టనున్నారు. తద్వారా ఆయా ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు సైతం సాగునీరు సజావుగా అందుతుందని అధికారులు వెల్లడించారు. ఈ పనుల నిర్వహణలో నిధుల దుర్వినియోగం కాకుండా, ప్రభుత్వ నిబంధనలకు లోబడి, ఇసుక పాలసీ ప్రకారం పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని చీఫ్ ఇంజనీర్ (నార్త్ కోస్ట్, విశాఖపట్నం) కు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాగునీటి రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు, జిల్లా అభివృద్ధిపై మంత్రి అచ్చెన్నాయుడికి ఉన్న చిత్తశుద్ధికి ఈ నిధుల మంజూరే నిదర్శనమని ఈ ప్రాంత రైతులు కొనియాడుతున్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర రైతాంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో విమర్శించారు. రైతు సంక్షేమం పేరుతో గొప్పలు చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వం ఆచరణలో మాత్రం వ్యవసాయ రంగాన్ని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా అయినప్పటికీ గత ప్రభుత్వం జిల్లాలోని ఏ ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకూ తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. వంశధార, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ వంటి కీలక ప్రాజెక్టులను ఐదేళ్ల పాటు పట్టించుకోకుండా రైతుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని అన్నారు. జిల్లాలో ఒక్క ప్రధాన ప్రాజెక్టుకు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడం వైసీపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమైన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రచారానికే పరిమితమైందని అచ్చెన్నాయుడు విమర్శించారు. కాలువల నిర్వహణ, ప్రాజెక్టుల పురోగతి, ఆయకట్టు స్థిరీకరణ వంటి అంశాలను గాలికి వదిలేయడంతో వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితులు వేగంగా మారాయని మంత్రి తెలిపారు. కేవలం 24 నెలల కాలంలోనే నిలిచిపోయిన ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసి, సాగునీటి పనులను పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. రైతు సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రైతు కష్టాన్ని గుర్తించే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని, అందుకే సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, కాలువల ఆధునీకరణ, నీటి వనరుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే జిల్లాలోని 12 మండలాల పరిధిలో ఉన్న సుమారు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుబాటులోకి రానుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.





# కార్గో ఎయిర్‌పోర్టును ఉపసంహరించుకోవాలి

**- జూలై 15న చలో ఆర్డీవో కార్యాలయం విజయవంతం చేయాలి**

**- వామపక్ష నాయకుల పిలుపు**



**పలాస, జూన్ 24 (వార్త):** ఉద్దానాన్ని విధ్వంసం చేసే కార్గో ఎయిర్పోర్ట్ ప్రతిపాదన రద్దు చేయాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ జూలై 15 తేదీన చలో పలాస ఆర్డిఓ కార్యాలయం జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, లిబరేషన్ జిల్లా నాయకులు తామాడ సన్యాసిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొనారి మోహనరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సి హెచ్ రవికుమార్ పిలుపునిచ్చారు. కార్గో ఎయిర్పోర్ట్ ప్రతిపాదన రద్దు చేయాలని, పర్యావరణం పరిరక్షించాలని కోరుతూ జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంకు కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొమర వాసు జోగి అప్పారావు అధ్యక్షతన వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంలో ఏకకాలంలో ఆరు పంటల పండుతూ అనేక అంతర పంటలు పండే అత్యంత విలువైన భూములు, మరొకవైపున తీర ప్రాంతం నుండి రక్షణ కల్పిస్తూ జిల్లాను పర్యావరణ పర్యావరణపరంగా రక్షణ కల్పిస్తున్న ఉద్దాన ప్రాంతాన్ని ఎందుకు విధ్వంసాన్ని కోరుకుంటున్నారని కేంద్ర పౌర విమానవాస శాఖ మంత్రి కేంద్రాపురం రామ్మోహన్ నాయుడుని ప్రశ్నించారు. కార్గో ఎయిర్పోర్ట్ కట్టాలని చిత్త శుద్ధి మీకు ఉంటే మూలపేట పోర్టు కేటాయించిన 2300 ఎకరాల్లో 500 ఎకరాల కేటాయిస్తే బ్రహ్మాండమైన కార్గో ఎయిర్పోర్ట్ వస్తుందని మరి ఎందుకు అక్కడ కట్టడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో సరుబుజ్జిలి వైపున ధర్మ ప్లాంట్ పేరుతో వేలాది ఎకరాలు, ఇటు అణు విద్యుత్ ప్లాంట్ తో వందలాది ఎకరాలు టెక్కలి ప్రాంతంలో పోర్టు కారిడార్ పేరుతో ప్రస్తుతానికి 23 గ్రామాల నుండి 38,000 ఎకరాలు, ఉద్దాన ప్రాంతంలో ప్రస్తుతానికి సుమారు 6000 ఎకరాలు, మరొకవైపున తీర ప్రాంతం భూములన్నీ కూడా ఆదానికి కట్టబెట్టేసి ఈ జిల్లాని ఎందుకు విధ్వంసానికి కోరుకుంటున్నారని కేంద్ర పౌర విమానాశ్రయ శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని ప్రశ్నించారు. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న ప్రజల భూములను దోపిడీ చేయడానికి ఎందుకు కోరుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టపెట్టే హక్కు మీకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. మూడుసార్లు ఎంపీగా ఒకసారి కేంద్రమంత్రిగా ఉన్న మీరు జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటి అని ప్రశ్నించారు. జిల్లా సస్యశ్యామలం చేయాలంటే జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఇచ్ఛాపురం వరకు రెండు పంటలకు నీరు ఇస్తే జల్లాసశ్యామలం అవుతుందని అన్నారు. ఎందుకు నిధులు కేటాయించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత 20 నెలలుగా అవిశ్రాంతి పోరాటం జరుగుతుందని అందులో భాగంగానే కార్గో ఎయిర్పోర్ట్ ప్రతిపాదన రద్దు చేయాలని జూన్ 25 నుండి గ్రామాల్లో సభలు సమావేశాలు నిర్వహించి సంతకాల సేకరించి జూలై 15 వ తేదీకి అన్ని గ్రామాల నుంచి వినతి పత్రాలు తెచ్చి మహా ధర్నా సందర్భంగా ఆర్డిఓ గారికి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఎప్పటికైనా కార్గో ఎయిర్పోర్ట్ ప్రతిపాదన రద్దు చేయాలని, లేకపోతే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు పత్తిరి దానేసు సీఐటీయూ నాయకులు యన్ గణపతి, పి ఓ డబ్ల్యూ నాయకురాలు పి కుసుమ, ఎ ఐ కె యం నాయకులు మద్దిలి రామారావు, ప్రజా సంఘాల నాయకులు జుత్తు వీరాస్వామి, జి బాలకృష్ణ, పి నాగేశ్వరావు, జనశక్తి నాయకులు కోనేరు గురయ్య, యం వినోద్ కుమార్, యస్ వీరాస్వామి, యు సోమనాదం, పి వైకుంతరావు, దానయ్య కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు గుంటు లోకనాధం, ఎంపళ్ళ కామేశ్వరరావు, లండ రామస్వామి, వి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## చిల్లంగి, మూఢ నమ్మకాలపై అవగాహన



**పలాస, జూన్ 24 (వార్త):** పలాస మండలంలో లోత్తూరు గ్రామంలో సమాజంలో ఇంకా కొనసాగుతున్న మూఢనమ్మకాలను నిర్మూలించి ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కాశీబుగ్గ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అవగాహన సదస్సును కాశిబుగ్గ సీఐ వై.రామకృష్ణ, ఎస్ఐ ఎన్.సునీల్ ఆధ్వర్యంలో మూన్కాలికి చెందిన పోలీసు సిబ్బంది బుధవారం లోత్తూరు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు చిల్లంగి వంటి మూఢనమ్మకాలను నమ్మి ఎలాంటి అపోహలకు గురికాకూడదని, అనారోగ్య సమస్యలు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని, సచివాలయ కార్యదర్శి, మహిళా సంరక్షణ కార్యదర్శికి తగిన సూచనలు చేశారు. ప్రభుత్వ సేవలు అందేలా ప్రజలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన చట్టాలపై కూడా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మహిళల భద్రత, చిన్నారుల సంరక్షణ, సైబర్ నేరాల నివారణ, ప్రజల హక్కులు, బాధ్యతల గురించి వివరించి చట్టాలను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## చెత్త నుంచి సంపద కేంద్రం పరిశీలన



**జి.సిగడాం, జూన్ 24(వార్త):** చెత్త నుంచి సంపద కేంద్రాలను పూర్వ వైభవం తీసుకురావాలని ఎంపీడీవో జి.రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన సీతంపేట గ్రామ చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాల పనితీరు మెరుగుపరచాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలని ప్రతి ఒక్కరు బాద్యతగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తడి,పోడి చెత్త లను వేరువేరు చేసి ఉంచుకోవాలని అలా పనిచేయాలని అప్పుడే స్వచ్ఛ గ్రామం ఉంటుందన్నారు. ప్లాస్టిక్, గాజు, కాగితం వంటి పొడి చెత్తను వేరుచేసి రీసైక్లింగ్ కోసం విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం లభిస్తుందని తెలిపారు. అయెన వెంట పైల శ్రీరాములు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

## సర్కారీ బడుల్లో 87 మంది చేరిక



**మెళియాపుట్టి, జూన్ 24(వార్త):** మెళియాపుట్టి మండలంలో వేర్వేరు ప్రాంతాలలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు బడి బయటనున్న 87 మంది విద్యార్థులను వివిధ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారులు ఎస్. దేవేందరరావు, మల్లారెడ్డి పద్మనాభం తెలిపారు. మండలంలో గల చాపర ఎంపీపీఎస్ పాఠశాల1 లో కొత్తగా జాయిన్ అయిన విద్యార్థులలో ఉన్న భయాన్ని పోగొట్టి వివిధ ఆసక్తికరమైన రీతిలో వారితో ప్రేమగా మాట్లాడి వారిలో ఉన్న ప్రతిభ పాటవాలను గుర్తించి ఆ దశగా ఉత్సాహవంతమైన వాతావరణాన్ని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖధికారులు కలిసి కల్పించారు. ఇంకా గ్రామాలలో బడి బయట ఉన్నా గాని, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా వారి తల్లిదండ్రులు తమకు సహకరించి తమ పిల్లల ఉన్నత విద్యభాస్యానికి బాటలు వేయాలని విద్యాశాఖ అధికారులు దేవేందర్రావు పద్మనాభములతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.నిరంజనరావు, ఉపాధ్యాయులు దివ్యక, ఏకాశమ్మ, రంజిత ప్రదాన్, కె. శిరీష తదితరులున్నారు.

## ఘనంగా బైరోడమ్మ అమ్మవారి సంబరం

**సోంపేట, జూన్ 24(వార్త):** బెంకిలి గ్రామస్తులు మంగళవారం రాత్రి నిర్వహించిన శ్రీ బైరోడమ్మ అమ్మవారి ఒక్కరోజు సంబర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత బైరోడమ్మకు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి గ్రామ పొలిమేరల్లో అమ్మవారి గుడి వద్ద పూజలు నిర్వహించారు. అమ్మవారి స్వరూపమైన గజముద్దలను గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా ప్రదర్శించారు. సంబరాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలి వచ్చారు. గ్రామ పెద్దలు, యువత ఘనంగా ఏర్పాట్లు చేపట్టారు.



# గిరిజన పాఠశాలలను కుదించొద్దు

**ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్**




**పలాస, జూన్ 24 (వార్త):** సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ )పరిధిలో ఉన్నటువంటి గిరిజన ఆశ్రమ పాఠశాలను రేషనలైజేషన్ పేరుతో తరగతులను కుదించే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం( పిడిఎస్ యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పలాస సూది కొండ కాలనీలో గల పిడియస్ యు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ కోనల్లో ఉన్న ఆదివాసి విద్యార్థులు ఆశ్రమ పాఠశాలలో చేరి వేలాదిమంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ వారు మే 15వ తేదీన జారీ చేసినటువంటి మెమోలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో ఆశ్రమ పాఠశాలలో 8, 9, 10 తరగతిలను కుదించే నిర్ణయం చేసిందని, విద్యార్థులు సమీప పాఠశాలలకు పంపించాలని ఆదేశించిందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోని రేషనలైజేషన్ ప్రక్రియను ఆపాలని, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది ఆదివాసి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో క్రమేపి మూసివేసే కుట్రలను ప్రభుత్వం చేస్తుందని, పాత విధానంలో యధావిధిగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ఆశ్రమ పాఠశాలలో కొనసాగించాలని అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో ప్రత్యేక డిఎస్సీని నిర్వహించాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని, ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, కుక్క మాటీ వాచ్మెన్ వంటి అన్ని రకాల పోస్ట్ లను తక్షణమే భర్తీ చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడియస్ యు నాయకులు విజయ్, రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ..

# నషా ముక్తి భారత్ అభియాన్

**పలాస, జూన్ 24 (వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నషా ముక్తి భారత్ అభియాన్ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల్లో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఈగల్ క్లబ్, నషా ముక్తి భారత్ అభియాన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వివిధ కార్యక్రమాలు చేపట్టారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థినీ, విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే ప్రతిజ్ఞ చేయించగా, మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. బుధవారం కళాశాల ప్రాంగణం నుండి జీడిపిక్క బొమ్మ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. గురువారం వ్యాసరచన పోటీలు, శుక్రవారం వక్తృత్వ (ఎలక్యూషన్) పోటీలు, శనివారం పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి తెలిపారు. క్విజ్, వక్తృత్వం, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ "యువత భవిష్యత్తే దేశ భవిష్యత్తు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యతని, విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో నషా ముక్తి భారత్ అభియాన్ కన్వీనర్ పి. వెంకటరమణ, ఈగల్ క్లబ్ కన్వీనర్ బి. నరసింహులు, సైన్స్ విభాగాధ్యక్షులు ఎన్. శ్రీనివాస్ పట్నాయక్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి. మధు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

**-ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు**



**మందస, జూన్ 24(వార్త):** ప్రభుత్వ బడుల్లోని అనుభవం కలిగిన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య అందుతోందని, తల్లిదండ్రులు అందరూ విధిగా తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, కొత్తపల్లి జిల్లా ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు గవ్వ భీమారావు కోరారు. భీమారావు చిన్న కుమారుడు గవ్వ తరుణ్ ని స్థానిక కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతిలో చేర్పించారు. ఆయన పెద్దకుమారుడు గవ్వ గిరీష్ కూడా ఇదే పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. ఉపాధ్యాయుడు గవ్వ భీమారావు నిర్ణయం పట్ల స్థానిక ప్రాథమిక., జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మెట్ట దామోదరం, కూన వేణుగోపాలరావు, స్థానిక పాఠశాల సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్బంగా భీమారావు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల బలోపేతానికి అందరం కలసికట్టుగా పనిచేయాలని కోరారు. భీమారావు చూపిన ఆదర్శానికి మందస మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, విద్యా అభిమానులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఎంఎల్ఏ శిరీషాను కలిసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు



**మందస, జూన్ 24(వార్త):** పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీషాను ఉపాధ్యాయులు కలిసారు. మెమో 57 ప్రాప్తికి 2004 ముందు నోటిఫై అయిన 2003 డిఎస్సీ ఉపాధ్యాయులు, పోలీసులు, గ్రూప్ 2 అధికారులు అందరూ కలిపి సుమారు 10,715 మందికి నిన్న జరిగిన క్యాబినెట్ మీటింగ్లో సిపిఎస్ నుండి ఓపిఎస్ కు మార్పు చేసేందుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసిన సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు థాంక్యూ సీఎం సార్ అనే నినాదంతో ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగుల శ్రేయస్సు కోరి హామీ ఇవ్వనప్పటికీ ఓపిఎస్ వర్తింపజేసే విధంగా నిరాడంబరముగా సాహోసోపేతమైనటువంటి నిర్ణయం తీసుకుని సుమారు 11వేల ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్యవాదాలు చేసినవారిలో ఉపాధ్యాయులు టి.రామకృష్ణ ఎస్.భాస్కరరావు డి.రామారావు, అరుణకుమారి, వందన ప్రేమ చంద్, రాజు, శ్రీను, మోహనరావు, శంకర్, కృష్ణచంద్రపాత్రో తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథ్ సాగర్ సుందరీకరణ పనులను పరిశీలించిన శిరీష

**పలాస, జూన్ 24 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జగన్నాథ్ సాగర్ సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా కాశీబుగ్గ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్, ఇతర అభివృద్ధి పనులను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల నాణ్యత, పురోగతిని అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సుందరీకరణ పనులు ప్రణాళికాబద్ధంగా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. జగన్నాథ్ సాగర్‌ను ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే తెలిపారు. చెరువు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడం, పట్టణ సౌందర్యాన్ని పెంచడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే జగన్నాథ్ సాగర్ సుందరీకరణ పూర్తయిన అనంతరం ఈ ప్రాంతం పలాస-కాశీబుగ్గ పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మున్సిపాలిటీ ముఖ్య నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక



# టిడ్కో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**పలాస, జూన్ 24(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలో ఏపీ టిడ్కో (ప్రధానమంత్రి యోజన యు) పథకం కింద 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల గృహాల కోసం దరఖాస్తు చేసుకుని, సంబంధిత మొత్తాలను డిమాండ్ డ్రాఫ్టుల రూపంలో చెల్లించినప్పటికీ గృహాలు మంజూరు కాకపోయిన లబ్ధిదారులకు ప్రభుత్వం చెల్లించిన మొత్తాలను తిరిగి అందజేసే బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా 1,149 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.4,17,40,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. గృహాలు మంజూరు కాకపోయిన కారణంగా లబ్ధిదారులు చెల్లించిన డిమాండ్ డ్రాఫ్టులు, మున్సిపల్ రసీదులు, ఇతర సంబంధిత పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారి వివరాలను ప్రభుత్వానికి సమర్పించగా, ప్రభుత్వం వారి చెల్లింపులను తిరిగి చెల్లించేందుకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ప్రజల కష్టార్జిత ధనం వారికి తిరిగి చేరేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గతంలో గృహాల కోసం ఆశతో చెల్లింపులు చేసిన లబ్ధిదారులకు ఈ చెక్కుల పంపిణీ ద్వారా ఉపశమనం లభిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు సంబంధించిన ప్రతి అంశాన్ని బాధ్యతాయుతంగా పరిష్కరిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో కూడా ప్రజా ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాస్ , గ్రంధాలయ చైర్మన్ పీరికట్ల విఠల్ , బీసీ సెల్ అధ్యక్షులు లోడగల కామేష్, గాలి కృష్ణారావు, చిన్ని గురుటి సూర్యనారాయణ, కోరికాను శంకర్, కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, వార్డు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## హరిపురంలో రూ.1.95కోట్లతో ఇండోర్ స్టేడియం




**మందస, జూన్ 24(వార్త):** మందస మండలంలోని హరిపురం అభివృద్ధి పథాన పయనిస్తోంది. దీనిలో భాగంగానే మరో అడుగు ముందుకు వేసింది. సుమారు రూ.2కోట్లతో ఇండోర్ స్టేడియం ప్రాజెక్టు హరిపురానికి మంజూరైంది. కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాల హయంలో పలు అభివృద్ధి పనులను హరిపురం వాసులు ఎంతో చక్కగా మంజూరు చేయించుకోగలుగుతున్నారు. దీనిలో భాగంగా ఈ ప్రాజెక్టు హరిపురం అభివృద్ధి సువర్ణావకాశంగా భావిస్తున్నారు. శ్రీకాకుళం పట్టణ అభివృద్ధి సంస్థ(సుడా) అమలు పరిచే ఈ ఇండోర్ స్టేడియాన్ని సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్నారు. 9నెలల్లో పూర్తి చేయడానికి సన్నహాలు చేస్తున్నారు. ఒక్కొక్కటిగా పలు పథకాలు, ప్రాజెక్టులను హరిపురం గ్రామస్థులు కృషి, పట్టుదల, అంకితభావంతో రాజకీయాలకు అతీతంగా సాధించుకుంటున్నారు. దీంతో మందస కన్నా.. హరిపురం ప్రాంతమే మంచి అభివృద్ధి పథాన పయనిస్తున్నట్టు భావిస్తున్నారు.

## సర్‌పై పారదర్శంగా పనిచేయాలి



**పలాస, జూన్ 24 (వార్త):** సర్ పై పారదర్శంగా పనిచేయాలని పలాస ఆర్డీవో ఆర్.అప్పలరాజు అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్) నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో వారాంత సమీక్ష సమావేశం బుధవారం పలాస తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి,ఎన్నికల నమోదు అధికారి ఆర్. అప్పలరాజు పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల తహసీల్దార్లు, ఎన్నికల పర్యవేక్షకులు (సూపర్వైజర్స్ ) బూత్ స్థాయి అధికారుల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పురోగతి, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాల తొలగింపు, ఓటరు వివరాల సవరణలు, ఫారం-6, 7, 8 దరఖాస్తుల స్వీకరణ, పరిష్కార ప్రక్రియలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా మరియు నిష్పాక్షికంగా సర్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు, అభ్యంతరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు.

## ఘనంగా పార్వతిమాత ఆలయ ప్రతిష్ఠ



**కంచిలి, జూన్ 24(వార్త):** కంచిలి పంచాయతీ బల్యపుట్టుగ గ్రామంలో నిర్వహించిన శ్రీ పార్వతిమాత ఆలయ ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు నిర్మాణం చేపట్టి విగ్రహం ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం, యజ్ఞం, హరిరామ హరేకృష్ణ సంకీర్తన, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బుధవారం ఎం ఎల్ సి నర్తు రామారావు, ఇచ్ఛాపురం వైసీపీ కన్వీనర్ శాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, నర్తు నరేంద్ర యాదవ్,కొల్లి ఈశ్వరరావు, గుమ్మడి రాందాస్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ అమలుపై హర్షం

**ఎల్ఎన్ పేట, జూన్ 24(వార్త):** ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా కూటమి ప్రభుత్వం సుమారు పదకొండు వేల మంది ఉద్యోగులకు ఓపీఎస్ (పాత పెన్షన్ విధానం) అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడంపై దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు లయన్ డా.ఎం.కె.మిశ్రో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్; ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలు, ఐఆర్, పీఆర్సీ మంజూరు చేయాలని కోరారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపుపై కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రమాదేవి, ఉపాధ్యాయులు ఎన్.రామారావు, టి.ఉపేంద్ర, పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రాలకు వంటసామగ్రి పంపిణీ

**-పిల్లలకు పౌష్టికాహారం తయారీలో వినియోగించాలని అధికారులు సూచన**

**- సారవకోట మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ కార్యక్రమం**




**సారవకోట, జూన్ 24(వార్త):** సారవకోట ఐసీడీఎస్ కార్యాలయ పరిధిలోని 198 అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం వంట సామగ్రిని పంపిణీ చేశారు. సారవకోట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సీహెచ్ వంశీ అంగన్‌వాడీ కార్యకర్తలకు సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో అందజేసిన వంట సామగ్రిని భద్రపరిచి, చిన్నారులకు అవసరమైన పౌష్టికాహార పదార్థాలు తయారు చేసి సమయానికి అందించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర ఎంతో ముఖ్యమని, అందువల్ల నాణ్యమైన ఆహారం తయారీకి ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే ఆహారం పరిశుభ్రతతో పాటు పోషక విలువలతో కూడి ఉండేలా చూడాలని, అందుకు ఈ వంటసామగ్రి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం చిన్నారుల ఆరోగ్యాభివృద్ధి, పోషకాహార లోప నివారణ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పరివేక్షణాధికారులు సీతారత్నం, మనోహరి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన చెత్తకుప్పతో ..
# ప్రయాణికుల అవస్థలు

**-దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుమ్మరిగుంట వాసులు**

**-చెత్త తొలగింపుపై అధికారులు దృష్టి సారించాలని డిమాండ్**

**సారవకోట, జూన్ 24(వార్త):** కుమ్మరిగుంట గ్రామంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తకుప్ప ప్రయాణికులు, గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. గ్రామ సచివాలయానికి సమీపంలో కుమ్మరిగుంట నుంచి బొంగాడిపేటకు వెళ్లే మార్గంలో, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి ఎదురుగా ఈ చెత్తకుప్ప ఉండటంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే చెత్తను పారవేయడంతో పరిసర ప్రాంతం అపరిశుభ్రంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఎండాకాలంలో దుర్వాసన మరింత ఎక్కువై రహదారిపై నడిచే వారికి, ద్విచక్ర వాహనదారులకు అసౌకర్యం కలుగుతోందని చెబుతున్నారు. సచివాలయం సమీపంలోనే చెత్త పేరుకుపోవడం వల్ల గ్రామ పరిశుభ్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయని అభిప్రాయపడుతున్నారు. చెత్తను సకాలంలో తొలగించకపోతే దోమలు, ఈగలు పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో చెత్తకుప్పల వల్ల మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు మళ్లీ అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.



## సుపరిపాలన, పథకాల్లో..
# ప్రజల భాగస్వామ్యమే లక్ష్యం



**మెళియాపుట్టి, జూన్ 24(వార్త):** రాష్ట్రంలోఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ప్రజానీకానికి అందించే సుపరిపాలనను గ్రామాలలో ఉన్న ప్రతి ఒక్కరు వరకు తీసుకునేళ్లే విధానాన్ని, ప్రభుత్వ పథకాలలో ప్రజలను భాగస్వామ్యం చేయడంతో పాటు రాబోయే రోజుల్లో వచ్చే స్థానిక ఎన్నికల పై సన్నద్ధత తదితర అంశాలపై జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మొదలవలస రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చర్చించారని జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ అనపాన రాజశేఖర్ రెడ్డి తెలిపారు. దేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు ప్రతినెల 4వ బుధవారం నాడు టిడిపి పార్టీ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో భాగంగా బుధవారం నాడు శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మొదలవలస రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొనడం జరిగిందని, ఈ సమావేశానికి విశిష్ట అతిథులుగా నరసన్నపేట, పలాస ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గౌతు శిరీషలు హాజరై శ్రీకాకుళం పార్లమెంటరీ పరిధిలోగల ఏడు నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీ సంస్థాగత బలోపేతం పైన, సర్ కార్యక్రమం పై ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ క్యాడర్ ను సమాయత్తం చేసే విధంగా పలు సలహా సూచనలను ఇస్తూ దీనిపై చర్చించడం జరిగినదన్నారు.

కార్యక్రమంలో శ్రీకాకుళం పార్లమెంటరీ టిడిపి పార్టీ ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్ రావు తోపాటు జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, పాతపట్నం నియోజకవర్గంనకు సంబంధించిన జిల్లా తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ (కార్యనిర్వహక కార్యదర్శులు) అనపాన రాజశేఖర్ రెడ్డి, అగతముడి అరుణ్ కుమార్, కార్యదర్శి బైరిసింగి లక్ష్మీనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి బుర్లె లలితకుమారి తదితరులున్నట్లు ఆయన తెలియజేశారు.



## జగ్గయ్యపేటలో రామమందిర ప్రతిష్ఠా మహోత్సవాలు

**- ఉత్సవ విగ్రహాలకు దాన్యాధివాసం నిర్వహణ**

**- రూ.28 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణం పూర్తి చేసిన గ్రామస్థులు**

**సారవకోట, జూన్ 24(వార్త):** జగ్గయ్యపేటలో రామమందిర ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉత్సవ విగ్రహాలకు దాన్యాధివాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్థుల సహకారంతో సుమారు రూ.28 లక్షల వ్యయంతో రామమందిర నిర్మాణం చేపట్టి పూర్తి చేసిన అనంతరం ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, హోమాలు, మండప ఆవాసాలు వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలను పురోహితులు వెంకటరమణ శాస్త్రి వేద మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి భావంతో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రామమందిర ప్రతిష్ఠ మహోత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయని, ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు గ్రామ ప్రజల ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. మహోత్సవాల సందర్భంగా భక్తులకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేశారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక





# ఇచ్ఛాపురంలో కనీస మౌలిక వసతులు కల్పించాలి



**ఇచ్ఛాపురం, జూన్ 24(వార్త):** జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో అత్యంత పురాతనమైన ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. నియోజకవర్గంలో రైతులు సాగునీటి సమస్యతో, ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ బుధవారం ఇచ్ఛాపురం పట్టణంలోని టీ సీ ఐ కార్యాలయంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్వజనుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇచ్ఛాపురం మండల కన్వీనర్ సాలిన ఢిల్లీ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, సంఘ సేవకురాలు డాక్టర్ సిపాన గుణవతి మాట్లాడుతూ ప్రభుత్వాలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకేనని, కానీ పన్నులు పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరైన విధానం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు అమిన్ సాహెబ్ పేట ప్రాంత ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆమె తెలిపారు. ఈ ప్రాంతంలో మంచినీటి సరఫరా, కాలువల పరిశుభ్రత వంటి కనీస సౌకర్యాలపై మున్సిపల్ అధికారులు తగిన శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. గతంలో ఒడిశా–ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతంగా ఉన్న అమిన్ సాహెబ్ పేట వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేదని, బోర్డర్ రద్దు తర్వాత ఈ ప్రాంత ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని సమావేశంలో పలువురు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఇక్కడ నిర్మించిన భవనాలకు అధిక పన్నులు విధిస్తున్నారని, వినియోగంలో లేని భవనాలకు కూడా పన్నులు వేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పన్నుల భయంతో కొందరు భవనాలను తొలగించుకున్నా, మున్సిపల్ అధికారులు అక్రమంగా పన్నుల వసూలుకు ఒత్తిడి చేస్తున్నారని వారు ఆరోపించారు. అమిన్ సాహెబ్ పేటలో గత ఆరు సంవత్సరాల క్రితం వేసిన పైప్‌లైన్లు నిర్లక్ష్యానికి సాక్ష్యంగా మిగిలిపోయి ఇప్పటికీ చుక్క మంచినీరు సరఫరా జరగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. బోర్డర్ రద్దు తర్వాత భూముల విలువలు తగ్గిపోయాయని, కొనుగోలు చేసేవారు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మూడో వార్డును ఇచ్ఛాపురం మున్సిపాలిటీ తొలగించి గ్రామపంచాయతీగా విభజించాలని ఆ ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారన్నారు. ప్రజల సమస్యలపై నాయకులను ఆశ్రయించినా సరైన స్పందన లభించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ పన్నుల భారం నుంచి ప్రజలను రక్షించి, మౌలిక వసతులు కల్పించే దిశగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం తమకు అండ దండగ నిలవాలని వారు కోరారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట పాలయ్య, క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు లోకనంది గోవిందరాజులు, మురళి, పలాస సబ్ డివిజనల్ కన్వీనర్ మద్దు సోమ శేఖర్, సోంపేట మండలం ప్రధాన కార్యదర్శి బంగారు విశ్వనాథం తదితరులు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రానికి చివరి ప్రాంతంగా ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గానికి ప్రభుత్వాలు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపట్టి, రైతులు మరియు ప్రజల సమస్యలను పరిష్కరించాలని, వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు మద్దెల సిమ్మయ్య, శాలిన షణ్ముఖరావు, సాలిన బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆటపాటలతో బోధన



**సారవకోట, జూన్ 24(వార్త):** సవరఅడ్డపనస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రాజు తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా, ఆసక్తికరంగా బోధించడమే తమ లక్ష్యమని చెప్పారు. బుధవారం ఐదో తరగతి పాఠ్యాంశంలో భాగమైన 'రంగుల గేయం'ను విద్యార్థులకు ఆటపాటలతో బోధించామని ఆయన వెల్లడించారు. చిన్నారుల వయస్సుకు అనుగుణంగా పాటలు, కదలికలు, సరదా పద్ధతులతో పాఠాన్ని వివరించడం వల్ల వారు సులభంగా అర్థం చేసుకోవడమే కాకుండా, ఆ అంశం వారి మనసుల్లో నిలిచిపోతుందని పేర్కొన్నారు. సాంప్రదాయ బోధనతో పాటు సృజనాత్మక పద్ధతులను అనుసరించడం ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతోందని ఆయన తెలిపారు. ఇలాంటి వినూత్న బోధనా విధానాలు పిల్లల అభ్యాస నైపుణ్యాలను పెంపొందించడంలో ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. ప్రస్తుతం పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులు చదువుతున్నారని, త్వరలో మరో ముగ్గురు చేరే అవకాశం ఉందని హెచ్‌ఎం డి.రాజు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగేలా నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు కృషి కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు.

## వ్యసనాలకు దూరంగా ఉండాలి




**నరసన్నపేట, జూన్ 24(వార్త):** నేటి యువత, ముఖ్యంగా విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడుతూ తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటున్నారని ఎక్సైజ్ శాఖ సీఐ వెంకట అప్పలనాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్సై అప్పారావు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి దశలో తీసుకునే తప్పు నిర్ణయాలు జీవితాంతం తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. బుధవారం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ లత ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబ, విద్యా, సామాజిక జీవితాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. విద్యార్థులు తాత్కాలిక ఆకర్షణలకు లోనై మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని, అలాంటి అలవాట్లు చదువుపై దృష్టి మరల్చడంతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని దెబ్బతీస్తాయని తెలిపారు. చెడు వ్యసనాలు క్రమంగా యువతను తప్పుదారిపట్టించి భవిష్యత్తును అంధకారంలోకి నెడతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు, సమాజం కలిసి విద్యార్థుల్లో అవగాహన పెంపొందించి మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉంచాల్సిన అవసరం ఉందని అధికారులు సూచించారు. యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకుని విద్య, లక్ష్యాల సాధనపైనే దృష్టి కేంద్రీకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మనబడి పనులు వేగవంతం చేయాలి

**- దూకులపాడు పాఠశాలలో నిర్మాణ పనులను పరిశీలించిన ఎంఈఓ ఉప్పాడ శాంతారావు**

**- నాణ్యతతో పాటు విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచన**

**నరసన్నపేట, జూన్ 24(వార్త):** దూకులపాడు పాఠశాలలో జరుగుతున్న 'మనబడి--మన భవిష్యత్తు' అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఉప్పాడ శాంతారావు ఆదేశించారు. బుధవారం పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడ కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. విద్యార్థుల అవసరాలు, భవిష్యత్తు వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని తరగతి గదులు, మౌలిక వసతుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పనులు కేవలం గడువులోపు పూర్తికావడమే కాకుండా, నాణ్యమైన ప్రమాణాలతో సాగాలని అన్నారు. నిర్మాణ పనులు మరింత వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన సహకారం అందించాలని ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో మెరుగైన వాతావరణం, సౌకర్యాలు కల్పించడం ద్వారా విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయితే విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని, ప్రభుత్వం చేపట్టిన 'మనబడి--మన భవిష్యత్తు' కార్యక్రమం లక్ష్యాలు నెరవేరుతాయని ఎంఈఓ తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సీఆర్పీ పెద్దవాడు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





## ఓటర్ల సవరణలో అవకతవకలపై వైసీపీ ఆందోళన

**నరసన్నపేట, జూన్ 24(వార్త):** ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో కొన్నిచోట్ల అవకతవకలు కనిపిస్తున్నాయని వైసీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల నమోదులో, సవరణల్లో పూర్తి పారదర్శకత పాటించాలని వారు కోరారు. బుధవారం నరసన్నపేట తహశీల్దార్ కార్యాలయంలో ఈఆర్వో జయదేవి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, నమోదవుతున్న అభ్యంతరాలు, పేర్ల చేర్పులు--తొలగింపులపై చర్చ జరిగింది. సమీక్షలో మాట్లాడిన ఈఆర్వో జయదేవి, ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడైనా పొరపాట్లు, అభ్యంతరాలు, అవకతవకలు కనిపిస్తే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి ప్రామాణిక పత్రం కావడంతో సవరణ ప్రక్రియలో నిర్లక్ష్యం లేకుండా అధికారులు పనిచేయాలని నేతలు కోరినట్లు సమాచారం. వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జనసేన జిల్లా కమిటీలో ..
# అశోక్‌కు ప్రాధాన్యత



**కొత్తూరు, జూన్ 24(వార్త):** జనసేన పార్టీలో మొదటి నుండి నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేసే కార్యకర్తలకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు లభిస్తుందని శ్రీకాకుళం జిల్లా జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యులు అదపాక అశోక్ అన్నారు. గురండికి చెందిన యువకుడు అదపాక అశోక్, జనసేన పార్టీ ఆవిర్భావం నుండి అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. మండల, నియోజకవర్గ స్థాయిల్లోని యువతను పెద్ద ఎత్తున పార్టీ వైపు నడిపిస్తూ తనవంతు సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన గతంలో కొత్తూరు మండల జనసేన ఉపాధ్యక్షుడిగా, ఆ తర్వాత అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, అశోక్ సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం ఆయనను మొదట హీరమండలం ఏఎంసీ డైరెక్టర్‌గా నియమించింది. తాజాగా శ్రీకాకుళం జిల్లా జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలో కూడా ఆయనకు చోటు కల్పించింది.

### నాయకత్వానికి కృతజ్ఞతలు...

ఈ సందర్భంగా అదపాక అశోక్ మాట్లాడుతూ... తాను నమ్ముకున్న జనసేన పార్టీ, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తన సేవలను గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. పాతపట్నం నియోజకవర్గ జనసేన కీలక నాయకులు కొరికాన రవికుమార్, భవాని తన శ్రమను గుర్తించి, ఈ పదవుల ద్వారా మాలాంటి సామాన్య కార్యకర్తలకు గౌరవాన్ని, అలంకారాన్ని తెచ్చారని కొనియాడారు. భవిష్యత్తులోనూ పార్టీ బలోపేతానికి, కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ పదవుల రాకపై నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు, గురండి గ్రామ యువత హర్షం వ్యక్తం చేస్తూ అశోక్‌కు అభినందనలు తెలిపారు.

## విద్యార్థుల సామర్థ్యాలు మరింత మెరుగుపడాలి



**నరసన్నపేట, జూన్ 24(వార్త):** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు మరింత మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పేడాడ దాలినాయుడు సూచించారు. బుధవారం నరసన్నపేటలోని తమ్మయ్యపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యా పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల అభ్యాస స్థాయిని ప్రత్యక్షంగా పరిశీలించిన ఎంఈఓ, వారి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. బోధన విధానంపై ఉపాధ్యాయులతో మాట్లాడి, విద్యార్థుల్లో పాఠ్యాంశాలపై అవగాహన పెంపొందేలా బోధన సాగాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలోనే చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో సూచించిన మార్గదర్శకాల మేరకు విద్యాబోధన కొనసాగాలని, ప్రతి విద్యార్థి నేర్చుకునే స్థాయిని గుర్తించి అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, మెరుగైన ఫలితాల సాధన కోసం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని నిరంతరం సమీక్షిస్తూ, వారిలో నేర్చుకునే ఆసక్తి పెంచే విధంగా బోధన ఉండాలని ఎంఈఓ దాలినాయుడు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్ పురోగతే ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.

## శివాలయంలో ఆక్రమణ ఫిర్యాదుపై అధికారుల విచారణ



**సారవకోట, జూన్ 24(వార్త):** సారవకోటలోని శివాలయ ప్రాంగణంలో స్థానికుడు దుకాణం ఏర్పాటు చేసిన ఘటనపై అధికారుల బృందం బుధవారం విచారణ చేపట్టింది. ఆలయ అర్చకుడు బుద్ధకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆలయ ప్రాంగణంలో దుకాణం ఏర్పాటు చేయడం వల్ల దేవాదాయ భూములు, ఆలయ పరిసరాల పరిరక్షణపై సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అధికారులు అక్కడి పరిస్థితులను పరిశీలించారు. టెక్కలి డీఎల్పీఓ రమణ, ఎంపీడీఓ మోహన్ కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ అప్పన్నలు కలిసి ఆలయ స్థలాన్ని సందర్శించి ఫిర్యాదుదారులు, స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఆలయ స్థలాలు లేదా దేవాదాయ భూములను ఆక్రమించడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వీలు లేదని స్పష్టం చేశారు. సంబంధిత అంశంపై పూర్తి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఆలయ ఆస్తుల పరిరక్షణ విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని, ఎలాంటి ఆక్రమణలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారుల విచారణతో సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన స్టేట్ సీఈవో

**- వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచన**

**- 92 శాతం వినియోగం అభినందనీయమని వ్యాఖ్య**

**నరసన్నపేట, జూన్ 24(వార్త):** నరసన్నపేట మండల పరిషత్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను స్టేట్ సీఈవో పోతుల వంశీధర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో అందిస్తున్న సేవలు, ఆహార నాణ్యత, వినియోగదారుల సౌకర్యాలపై ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌కు వచ్చిన వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయాలని, క్యాంటీన్ నిర్వహణలో నాణ్యత, పరిశుభ్రత, సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. అన్న క్యాంటీన్ సేవలను నూటికి 92 శాతం మంది వినియోగించుకోవడం ఆనందించదగ్గ విషయమని పోతుల వంశీధర్ పేర్కొన్నారు. ప్రజల ఆదరణ పొందుతున్న ఈ సేవలను మరింత మెరుగుపరచి అందుబాటులో ఉంచాలని సూచించారు. క్యాంటీన్ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో అన్న క్యాంటీన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఆర్థికంగా బలహీన వర్గాలకు తక్కువ ఖర్చుతో భోజనం అందించడం ద్వారా ఇవి ఎంతో ఉపయోగపడుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. తనిఖీ సందర్భంగా క్యాంటీన్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546